తొలి దక్షిణాది నటుడిగా
అల్లు అర్జున్ సెన్సేషనల్



5లో.

RNI NO :Title-Code :-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

అనుక్షణం ప్రజలపక్షం...
తెలుగు దినపత్రిక

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పనిచేయుటకు
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.
ఎడిటర్ : బిర్రు కరుణాకర్
Cell: 9701249103

సంపుటి - 1 సంచిక - 175 శుక్రవారం 22 మార్చి 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# మల్కాజిగిరిలో కాంగ్రెస్ జండా ఎగరాల్సిందే



- మల్కాజ్‌గిరిలో నా గెలుపు... తెలంగాణకు సీఎం స్థాయికి ఎదిగేలా చేసింది: రేవంత్ రెడ్డి
- సీఎంగా మాట్లాడగలుగుతున్నానంటే ఆ గొప్పతనం మల్కాజ్‌గిరి నియోజకవర్గ ప్రజలదేనని వ్యాఖ్య
- ఆనాడు నాయకులు అమ్ముడుపోయినా కార్యకర్తలు మాత్రం తనను భుజాలపై మోసి ఎంపీగా గెలిపించారన్న సీఎం
- కేంద్రంతో సఖ్యతగా మెలిగి స్కైవేలు నిర్మించుకుంటున్నామని వెల్లడి



**మార్చి 21(జర్నలిస్ట్ వార్త)హైదరాబాద్ :** మల్కాజ్‌గిరిలో తన గెలుపు... తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగేలా చేసిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి హాజరైన రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... తాను సీఎంగా ఇప్పుడు ఇక్కడ మాట్లాడగలుగుతున్నానంటే ఆ గొప్పతనం మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలదే అన్నారు. ఆనాడు నాయకులు అమ్ముడుపోయినా కార్యకర్తలు మాత్రం తనను భుజాలపై మోసి ఎంపీగా గెలిపించి ఢిల్లీకి పంపించారని గుర్తు చేసుకున్నారు. 2,964 బూత్‌లలో ప్రతి బూత్‌లో ఒక సైనికుడిలా కార్యకర్తలు పని చేశారన్నారు. **మిగతాది 2లో...**

# ఢిల్లీ లిక్కర్ కేసులో సీఎం కేజ్రీవాల్ అరెస్ట్..



**కేజ్రీవాల్ నివాసంలోనే రెండు గంటల పాటు విచారించిన ఈడీ అధికారులు**

**ఆ తర్వాత అరెస్ట్ చేసినట్లు ప్రకటన**

**కేజ్రీవాల్ అరెస్టైనా రాజీనామా చేయరని ముందే చెప్పిన స్పీకర్**

**మార్చి 21(జర్నలిస్ట్ వార్త)హైదరాబాద్ :** ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు గురువారం రాత్రి అరెస్ట్ చేశారు. సెర్చ్ వారెంట్‌తో సాయంత్రం నుంచి ఆయన నివాసంలో సోదాలు నిర్వహించిన ఈడీ ఆ తర్వాత ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసింది. రెండు గంటల పాటు ఆయనను విచారించిన అనంతరం అరెస్ట్ చేసినట్లు ప్రకటించింది. అరెస్ట్ విషయాన్ని కేజ్రీవాల్ భార్యకు చెప్పింది. కాసేపట్లో ఆయనను ఈడీ కార్యాలయానికి తరలించనున్నారు. రేపు రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరచనున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన నివాసం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతున్నారు.
**మిగతాది 2లో...**

# పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు



**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి**

2లో.

# కాంగ్రెస్ మూడో జాబితా

## సికింద్రాబాద్ నుంచి దానం నాగేందర్, మల్కాజ్‌గిరి నుంచి సునీత...

**57 మంది అభ్యర్థులతో మూడో జాబితాను విడుదల చేసిన కాంగ్రెస్ తెలంగాణ నుంచి ఐదుగురు అభ్యర్థుల ప్రకటన**

**పెద్దపల్లి నుంచి వంశీకృష్ణ, చేవెళ్ల నుంచి రంజిత్ రెడ్డి, నాగర్ కర్నూల్ నుంచి మల్లు రవి పెండింగ్‌లో 8 నియోజకవర్గాల అభ్యర్థుల ప్రకటన**

**మార్చి 21(జర్నలిస్ట్ వార్త)హైదరాబాద్** ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్, సునీత మహేందర్ రెడ్డిలకు పార్టీ అధిష్ఠానం టిక్కెట్లు కేటాయించింది. లోక్ సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ 57 మంది అభ్యర్థులతో మూడో జాబితాను విడుదల చేసింది. కాంగ్రెస్ కీలక నేత అధిర్ రంజన్ చౌదరి పశ్చిమ బెంగాల్‌లోని బెర్హంపూర్ నుంచి మళ్లీ పోటీ చేయనున్నారు. ఇందులో



తెలంగాణ నుంచి ఐదుగురు అభ్యర్థులను ప్రకటించింది. పెద్దపల్లి నుంచి గడ్డం వంశీకృష్ణ, సికింద్రాబాద్ నుంచి దానం నాగేందర్, చేవెళ్ల నుంచి రంజిత్ రెడ్డి, మల్కాజ్‌గిరి నుంచి సునీత మహేందర్ రెడ్డి, నాగర్ కర్నూల్ నుంచి మల్లు రవి పేర్లను ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ తొలి జాబితాలో నలుగురిని ఖరారు చేసింది. మహబూబ్ నగర్ నుంచి వంశీచంద్ రెడ్డి, జహీరాబాద్ నుంచి సురేశ్ షెట్కార్, మహబూబాబాద్ నుంచి బలరాం నాయక్, నల్గొండ నుంచి రఘువీర్ రెడ్డిల పేర్లను ప్రకటించింది. మెదక్, ఖమ్మం, భువనగిరి, ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్... ఈ ఎనిమిది లోక్ సభ స్థానాలపై సస్పెన్స్ కొనసాగుతోంది.

# ప్రచారానికి డబ్బుల్లేవ్



**మా నేతలను ప్రచారానికి ఎక్కడకూ పంపించలేకపోతున్నాం..**

**రైలు టిక్కెట్‌కు కూడా డబ్బుల్లేవ్: రాహుల్ గాంధీ**

**కాంగ్రెస్ బ్యాంకు ఖాతాల ఫ్రీజ్, ఎన్నికల బాండ్ల అంశాలపై మాట్లాడిన రాహుల్ గాంధీ**

**ఎన్నికల సమయంలో డబ్బులు లేకపోవడంతో ప్రచారం చేయలేకపోతున్నామని వెల్లడి**

**మార్చి 21(జర్నలిస్ట్ వార్త)హైదరాబాద్ :** ఎన్నికల ప్రచార సమయంలో మా నేతలను ఎక్కడకూ పంపించలేకపోతున్నాం... విమాన ప్రయాణాలను పక్కన పెట్టాం... కనీసం రైలు టిక్కెట్లు కొనడానికి కూడా తమ వద్ద డబ్బులు లేవని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. కాంగ్రెస్ బ్యాంకు ఖాతాల ఫ్రీజ్, ఎన్నికల బాండ్ల అంశాలపై ఆయన మాట్లాడుతూ... తమ పార్టీని దెబ్బతీసేందుకు ప్రధాని మోదీ తీవ్ర చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో డబ్బులు లేకపోవడంతో ప్రచారం కూడా చేయలేకపోతున్నట్లు తెలిపారు. **మిగతాది 2లో...**

# ధరణిపై త్వరలో శ్వేతపత్రం

**త్వరలో రెవెన్యూపై వైట్ పేపర్**

**ధరణి ఆ సర్కారు సీక్రెట్ సంస్థ**

**సీఎం వెంట ఉంటే.. నెంబర్ టూ ఎలా?**

**తాగునీటి సమస్యపైనే ప్రత్యేక దృష్టి**

**మిషన్ భగీరథను మరింత మెరుగు పర్చుతాం**

**మంత్రి పొంగులేని శ్రీనివాసరెడ్డి**



**మార్చి 21(జర్నలిస్ట్ వార్త)హైదరాబాద్ :** మేం ఇంకా గేట్లు తెరవలేదు, తెరిస్తే వరద వస్తుంది అని మంత్రి పొంగులేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మంలో విలేఖరులతో మాట్లాడుతూ, త్వరలో రెవెన్యూ శాఖపై వైట్ పేపర్ విడుదల చేస్తాం, కమిటీ సూచనల మేరకు నిర్ణయం తీసుకుంటాం, సీఎం అయ్యే స్థాయి నాకు లేదు, అది బేస్ లెస్ వాదన, ఆశలకు కూడా ఒక హద్దు ఉంటుందని అన్నారు. ప్రస్తుతం తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించామని, మిషన్ భగీరథ అద్భుతమైనదని, ఇంకా మెరుగుపరిచే దిశగా చర్యలు చేపడుతామని పొంగులేటి అన్నారు. అందుబాటులో ఉన్న జలవనరులు పరిగణనలోకి తీసుకుని , తెలంగాణను మోడల్ స్టేట్ గా తీర్చిదిద్దుతాం అన్నారు. ఇక గృహ నిర్మాణానికిప్రతియేటా 18 వేల నుంచి 20 వేల కోట్లు అంచనా వేశామన్నారు. ఇక ధరణి పోర్టల్ గురించి మాట్లాడుతూ, అది ఆ ప్రభుత్వానికి ధరణి సీక్రెట్ సంస్థ, ఈ వ్యవస్థకు మేం దూరం అన్నారు. ఇక ముఖ్యమంత్రి వెంట ఉంటే రెండో స్థానం ఎలా అంటారు, మేం ఫోన్ ట్యాపింగ్ చెయ్యం.. ఆ అవకాశం మాకు అక్కర్లేదని పొంగులేటి వ్యాఖ్యానించారు.
**మిగతాది 2లో...**

# మల్కాజిగిరిలో కాంగ్రెస్ జండా ఎగరాల్సిందే

(మొదటి పేజి తరువాయి)
దేశంలోనే అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గం మల్కాజ్‌గిరి అని... నాటి మల్కాజ్‌గిరి గెలుపు తాను ఈ స్థాయికి ఎదిగేందుకు దోహదపడిందన్నారు. కేసీఆర్ పతనం 2019 మల్కాజ్‌గిరి పార్లమెంట్ నుంచే ప్రారంభమైందన్నారు. తాము 100 రోజులు పూర్తిగా పాలన పైనే దృష్టి సారించామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంపు, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేసుకుంటున్నామన్నారు. మల్కాజ్‌గిరి అభివృద్ధి కోసం కేంద్రంతో సఖ్యతగా మెలిగి స్కైవేల నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. మెట్రో, ఎంఎంటీఎస్ రావాలన్నా... జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమస్యలు తీరాలన్నా కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రమంతా తుఫాను వచ్చినట్లు గెలిచినా మల్కాజ్‌గిరి లోక్ సభ స్థానంలో మాత్రం ఆశించిన ఫలితాలు రాలేదన్నారు. ఏడు అసెంబ్లీ స్థానాల్లో నాలుగింట గెలిస్తే అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉండేదన్నారు. అందుకే లోక్ సభ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలన్నారు. అప్పుడే మన ప్రాంతం అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవడానికి మనకు అవకాశం వచ్చిందని... పార్లమెంట్‌తో పాటు కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ గెలవాలన్నారు. పార్టీ అభ్యర్థులను హోలీ పండుగ నాడు అధిష్ఠానం ప్రకటిస్తుందని తెలిపారు.

# సీఎం కేజ్రీవాల్ అరెస్ట్..

(మొదటి పేజి తరువాయి)
కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడానికి కొన్ని నిమిషాల ముందు ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ రామ్ నివాస్ గోయల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేసినా ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయరని తెలిపారు. ఎన్నికలకు ముందు ఆయన గొంతు నొక్కేందుకు కేంద్రం ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఆయనను అరెస్ట్ చేస్తే జైలు నుంచి ఢిల్లీని పరిపాలన చేస్తారని సాయంత్రమే చెప్పారు. అంతకుముందు రామ్ నివాస్ గోయల్ మాట్లాడుతూ... 'ముఖ్యమంత్రి నివాసం వద్ద మోహరించిన బలగాలను చూస్తే ఆయనను అరెస్ట్ చేయడానికి ఈడీ వచ్చినట్లుగా కనిపిస్తోంది. కేసు విచారణకు కోర్టు అంగీకరించినప్పటికీ ఈడీ ఎందుకు ఇలా వ్యవహరిస్తోంది. మనీష్ సిసోడియాను గత ఏడాది అరెస్ట్ చేసిన ఈడీ ఇప్పటి వరకు ఆయనపై చేసిన ఆరోపణలను నిరూపించలేకపోయింది. తమకు ఇది చిన్న ఎదురుదెబ్బ... అయినా పార్టీ మరింత బలపడుతుంది. అరెస్ట్ తర్వాత సీఎం కేజ్రీవాల్ రాజీనామా చేయవద్దని పార్టీ, ఎమ్మెల్యేలందరూ నిర్ణయించారు. జైలు నుంచే ప్రభుత్వాన్ని నడిపిస్తారు' అన్నారు.

# పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు

**మార్చి 21(జర్నలిస్ట్ వార్త)హైదరాబాద్ :**
హైదరాబాద్ : లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి సమర్థవంతంగా అమలు చేయడానికి వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి పేర్కొన్నారు. ఎన్నికల కోడ్? అమలుపై గురువారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. పోలీస్, ఎక్సయిజ్, వాణిజ్య పన్నులు, అటవీ, రెవెన్యూ, రవాణా తదితర శాఖల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ%
%ా% రాష్ట్రంలో ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో ఏవిధంగానైతే పనిచేశారో అదే స్ఫూర్తితో రానున్న లోక్ సభ ఎన్నికల్లోనూ విధులు నిర్వర్తించాలని సూచించారు.
రాష్ట్రంలో సరిహద్దు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్, ఛత్తీస్ గఢ్ సరిహద్దులలో ప్రత్యేకంగా చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని సూచించారు. అంతేకాకుండా చెక్ పోస్టుల వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే వివిధ శాఖల ల ద్వారా చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని వెల్లడించారు. వీటిలో పోలీస్ శాఖ ద్వారా 444 చెక్ పోస్టులుండగా, 9 అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ లున్నాయని అన్నారు. ఇప్పటివరకు పోలీస్ శాఖ ద్వారా పదికోట్ల రూపాయలను స్వాధీన పర్చుకోవడంతోపాటు లైసెన్స్ లేని ఆయుధాలు, పేలుడు పదార్థాలు, జిలెటిన్ స్టిక్స్, బంగారాన్ని కూడా స్వాధీన పర్చుకున్నామని తెలిపారు. రవాణా శాఖ



ద్వారా 15 చెక్ పోస్టులు, 52 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ చెక్ పోస్టులు 24 గంటలు పనిచేస్తాయని తెలిపారు. రవాణా శాఖ బృందాలు జరిపిన తనిఖీ లలో రూ. 34 .31 లక్షలను స్వాధీన పర్చుకున్నారని అన్నారు. వాణిజ్య పన్నుల శాఖ ద్వారా 16 అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం తోపాటు 31 స్ట్రాటెజిక్ పాయింట్లపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు.

### మద్యం రవాణాపై నిఘా

ఎక్సయిజ్ శాఖ ద్వారా 21 అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులు, ఆరు మొబైల్ చెక్ పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు, అక్రమ మద్యం తయారీకి అవకాశం ఉన్న ఎనిమిది జిల్లాలను గుర్తించి వాటిపై ప్రత్యేక దృష్టి సారించామని సీఎస్ తెలిపారు. మద్యం అక్రమ రవాణా కు అవకాశమున్న అయిదు రైలు మార్గాలను గుర్తించి వాటి నిరోధానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటివరకు రూ. 50 లక్షల విలువైన మద్యాన్ని స్వాధీన పరుచుకున్నామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని డిస్టిలరీలపై ప్రత్యేక నిఘా ఉంచామని, సీసీ టీవీలను ఏర్పాటు చేసి డిస్టిలరీస్ ద్వారా మద్యం సరఫరాను పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్ లోని పోలీస్ శాఖకు చెందిన పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రం నుండి కూడా మద్యం రవాణాపై సీసీ టీవీ ల ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించినట్టు తెలిపారు. అటవీ శాఖ ద్వారా కూడా 65 చెక్ పోస్టులు ఏర్పాటు కాగా దీనిలో 18 అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ని పటిష్టంగా అమలుచేయడానికి అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని శాంతి కుమారి తెలిపారు.
సమావేశంలో డీజీపీ రవీ గుప్తా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, పీసీసీఎఫ్ దొబ్రియల్, హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, అడిషనల్ డీజీ ఎస్.కె. జైన్, రవాణా శాఖ కార్యదర్శి శ్రీనివాస రాజు, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ టీ.కె. శ్రీదేవి, ఎక్సయిజ్ శాఖ కమిషనర్ శ్రీధర్, సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

# 'వికసిత భారత్' వాట్సాప్ సందేశాలకు
## బ్రేకులు వేసిన ఎన్నికల సంఘం


**మార్చి 21(జర్నలిస్ట్ వార్త)హైదరాబాద్ :**
ప్రధాని నరేంద్ర మోదీ అభిలషిస్తున్న 'వికసిత భారత్' ప్రచారానికి తాత్కాలిక అడ్డుకట్ట పడింది. దేశంలో ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో వాట్సాప్ లో వికసిత భారత్ సందేశాలకు కేంద్ర ఎన్నికల సంఘం బ్రేకులు వేసింది. సోషల్ మీడియాలో వికసిత భారత్ ప్రచారాన్ని ఆపేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఈసీ ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర



ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖకు నోటీసులు పంపింది. కోడ్ అమల్లో ఉన్న సమయంలో సోషల్ మీడియా వేదికగా కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేయడం నిబంధనలకు వ్యతిరేకం అని స్పష్టం చేసింది. దేశంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత కూడా సోషల్ మీడియాలో, ముఖ్యంగా వాట్సాప్ లో వికసిత భారత్ సందేశాలు వస్తున్నాయని ఈసీకి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదుల నేపథ్యంలోనే ఈసీ కేంద్రానికి నోటీసులు జారీ చేసింది.

# ఈడీ కార్యాలయంలో కవితను
# కలిసిన కేటీఆర్, తల్లి శోభమ్మ

**మార్చి 21 జర్నలిస్టు జర్నీ న్యూస్:**
ఢిల్లీ మద్యం కేసులో అరెస్టై దేశ రాజధానిలోని ఈడీ కేంద్ర కార్యాలయంలో ఉన్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితను ఆమె తల్లి శోభమ్మ, సోదరుడు, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు కలిశారు. గురువారం సాయంత్రం ములాఖత్ సమయంలో వీరు కవితను కలిశారు. వీరిద్దరితో పాటు న్యాయవాది మోహిత్ రావు కూడా ఆమెను కలిశారు.



కుటుంబ సభ్యులు, లాయర్ దాదాపు 50 నిమిషాల పాటు కవితతో మాట్లాడారు. కాగా, కవితను ఈడీ అధికారులు ఐదు రోజులుగా విచారిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఆమెను అరెస్ట్ చేసిన ఈడీ శనివారం ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో ప్రవేశపెట్టింది. కోర్టు ఆమెను వారం రోజుల ఈడీ కస్టడీకి అప్పగించింది. కవితను ఈడీ కేంద్ర కార్యాలయంలోనే ఉంచి ఆదివారం నుంచి విచారిస్తున్నారు.

# ధరణిపై త్వరలో శ్వేతపత్రం

(మొదటి పేజి తరువాయి)
రాష్ట్రానికి రావాల్సిన నిధులపై కేంద్ర ప్రభుత్వంతో కొట్లాడేందుకు వెనకాడబోమన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ 10కి పైగా ఎంపీ సీట్లు గెలవబోతున్నామన్నారు పొంగులేటి. కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ పార్టీ అని తమకు ఎంఐఎం మద్దతు తెలపుతుందన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో బీఆర్‌ఎస్ కు ఒకటి రెండు ఎంపీ సీట్లు గెలిస్తే ఎక్కువన్నారు. బీఆర్‌ఎస్ నేతలపై కక్ష పూరితంగా కేసులు పెడుతున్నామంటున్నారనే దానిపై వివరణ ఇస్తూ,. అవన్ని గత ప్రభుత్వంలో వాళ్లు అధికార దుర్వినియోగంతో చేసిన తప్పులన్నారు.
జలాశయాల్లో నీరు లేకపోవడం, పంటలు ఎండిపోవడం వంటి ఫోటోలు.. వీడియోలు పెట్టి కొన్ని మీడియా సంస్థలు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు పొంగులేటి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది డిసెంబర్ లో.. రాబోయే వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని నీటి నిల్వలు ఉంచాల్సిన బాధ్యత గత ప్రభుత్వంపై ఉందని,..కానీ వాళ్లు చేయాల్సిన పనులు చేయకుండా భాద్యత విస్మరించారని తెలిపారు. కాళేశ్వరం ఫలితం ఎవరికి దక్కిందో అందరికి తెలిసిందేన్నారు.

# ప్రచారానికి డబ్బుల్లేవ్



(మొదటి పేజి తరువాయి)
తమ పార్టీపై ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పాల్పడుతున్న నేరపూరిత చర్యకు పాల్పడుతున్నారన్నారు. మా బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజుల్లో బ్యాంకు ఖాతాలు పని చేయకుంటే పరిస్థితి ఎలా ఉంటుందో అందరికీ తెలిసిందే అన్నారు. తాము ఎలాంటి ట్రాన్సాక్షన్స్ చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. తమ పార్టీ ఖాతాలను ఫ్రీజ్ చేయడమంటే భారత ప్రజాస్వామ్యాన్ని అడ్డుకోవడమే అన్నారు. ఈ రోజు దేశంలో ప్రజాస్వామ్యం అనేదే లేకుండా పోయిందన్నారు. ప్రజాస్వామ్యం అనేది ఇప్పుడు అబద్దంగా మారిందని వ్యాఖ్యానించారు. దేశంలో 20 శాతం మంది ఓటర్లు తమకు మద్దతుగా ఉన్నారని పేర్కొన్నారు. కానీ తాము రెండు రూపాయలు కూడా చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఎన్నికల్లో పోరాడకుండా తమ సామర్థ్యాన్ని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ అంశానికి సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని వాపోయారు

# ప్రకృతిని సంరక్షిద్దాం
# అడవులను కాపాడుకుందాం
## మంత్రి కొండా సురేఖ

**మార్చి 21(జర్నలిస్ట్ వార్త)హైదరాబాద్ :**
ప్రకృతి మాత్రమే శాశ్వతమైనదనే సత్యాన్ని గుర్తిస్తే, మానవ మనుగడకు ఆధారంగా నిలుస్తున్న అడవులను జాగ్రత్తగా కాపాడుకునేలా ఉద్యమించేందుకు ప్రేరణ లభిస్తుందని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ప్రకృతిని సంరక్షిస్తూ, ప్రకృతితో మమేకమై జీవించడమే అర్థవంతమైన జీవితమని తెలిపారు.



ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి కొండా సురేఖ మాట్లాడారు. అడవులను సంరక్షించుకునే దిశగా ప్రజలకు అవగాహన కలిగించే నిమిత్తం ప్రతి యేడు మార్చి 21న ప్రపంచ అటవీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని సురేఖ తెలిపారు. ఈ సంవత్సరం 'అడవులు, ఆవిష్కరణలు మెరుగైన ప్రపంచం కోసం కొత్త పరిష్కారాలు' థీమ్ తో ప్రపంచవ్యాప్తంగా అటవీ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. పర్యావణంలో సమతుల్యత లోపించి విపత్తుల బారిన పడుతున్నామని పేర్కొన్నారు. అడవులను జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉన్నదని పేర్కొన్నారు. తెలంగాణలో 24.05 శాతం ఉన్న అడవుల విస్తీర్ణాన్ని జాతీయ అటవీ విధానం ప్రకారం 33 శాతానికి పెంచే దిశగా కార్యాచరణను అమలు చేస్తున్నామని తెలిపారు.

# హైపర్ సోనిక్ మిస్సైల్ ను పరీక్షించిన అమెరికా...
## రష్యా, చైనాలకు హెచ్చరిక!

**మార్చి 21(జర్నలిస్ట్ వార్త)హైదరాబాద్ :**
అమెరికా వాయుసేన పసిఫిక్ మహాసముద్రంలో తొలిసారిగా ఓ హైపర్ సోనిక్ మిస్సైల్ ను పరీక్షించింది. గ్వామ్ దీవిలో ఉన్న ఆండర్సన్ ఎయిర్ ఫోర్స్ బేస్ నుంచి బయల్దేరిన బి-52 బాంబర్ విమానం నుంచి ఈ హైపర్ సోనిక్ మిస్సైల్ ను ప్రయోగించారు. మార్చి 17న ఈ క్షిపణి పరీక్ష చేపట్టగా, కచ్చితంగా లక్ష్యాన్ని ఛేదించినట్టు తెలుస్తోంది. కాగా, ఈ శత్రుభీకర క్షిపణి ప్రయోగాన్ని అమెరికా చేపట్టడం వెనుక వ్యూహాత్మక ప్రయోజనాలు దాగున్నాయని, ఇది రష్యా, చైనాలకు హెచ్చరిక వంటిదని రక్షణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ మిసైల్ ను 'ఆల్ అప్ రౌండ్ ఏజీఎం 183ఏ ఎయిర్ లాంచ్ డ్ రాపిడ్ రెస్పాన్స్ వెపన్'(ఏఆర్ఆర్ డబ్ల్యూ) గా వ్యవహరిస్తారు.




ఈ ప్రయోగం తీరుతెన్నులను పసిఫిక్ మహాసముద్రంలోని మార్షల్ దీవుల్లో ఉన్న రీగన్ టెస్ట్ సైట్ నుంచి పర్యవేక్షించారు. ఇప్పటివరకు ఏఆర్ఆర్ డబ్ల్యూ క్షిపణిని అమెరికా ప్రధాన భూభాగం నుంచి పలుమార్లు పరీక్షించారు. కీలకమైన భూతల స్థావరాలను ధ్వంసం చేయడంలో ఈ క్షిపణి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని భావిస్తున్నారు.
దీని వేగం గంటకు 4 వేల కిలోమీటర్లు. సాంకేతిక పరిభాషలో ఇది మాక్ 5 వేగంతో దూసుకెళుతుంది. రెప్పపాటులో దూసుకెళ్లే ఈ క్షిపణిని గుర్తించడం కానీ, మార్గమధ్యంలోనే అడ్డుకోవడం కానీ జరిగే పని కాదు! కాగా, చైనా, రష్యా దేశాలు కూడా హైపర్ సోనిక్ క్షిపణులను అభివృద్ధి చేస్తున్నాయి. చైనా 2014 నుంచే ఈ పనిలో నిమగ్నమై ఉంది. 2021లో చైనా ప్రయోగించిన హైపర్ సోనిక్ మిస్సైల్ కు ప్రపంచాన్ని చుట్టివచ్చే సామర్థ్యం ఉందని ఓ అమెరికా వాయుసేన అధికారి తెలిపారు.
ఇక, ఈ విషయంలో మరింత ముందున్న రష్యా తన జిర్కాన్ హైపర్ సోనిక్ మిస్సైల్ ను ఈ ఏడాది ఆరంభంలో ఉక్రెయిన్ పై ప్రయోగించింది.

# రైతుబంధుపై కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
## చెట్లు, గుట్టలు, పుట్టలు ఉంటే తాము రైతుబంధు ఇవ్వమని స్పష్టీకరణ

**మార్చి 21(జర్నలిస్ట్ వార్త)హైదరాబాద్ :**
రైతుబంధుపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జీవన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ... చెట్లు, గుట్టలు, పుట్టలు ఉంటే తాము రైతుబంధు ఇవ్వమని స్పష్టం చేశారు. న్యాయంగా రైతుబంధు వచ్చిన వారు మాకు ఓటు వేయాలని కోరారు. బీజేపీపై జీవన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రధాని నరేంద్ర మోదీ పదేళ్లలో ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా?



అని ప్రశ్నించారు. ఓటు కోసం బీజేపీ నాయకులు వస్తే నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బీజేపీ గెలిస్తే అందరి ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామని ప్రధాని మోదీ చెప్పారని... రూ.15 లక్షలు వచ్చిన వెంటనే బీజేపీకి ఓటు వేద్దామని... రాకుంటే మాత్రం కాంగ్రెస్‌కు వేయాలన్నారు.

# పదో తరగతి పరీక్షా కేంద్రాల తనిఖీ

## - హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్



హనుమకొండ, మార్చి21(జర్నలిస్ట్ వార్త): హనుమకొండ జిల్లా పరిధిలో జరుగుతున్న పదో తరగతి పరీక్షా కేంద్రాలను గురువారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తనిఖీ చేశారు. నయీమ్ నగర్ లోని తేజస్వి హై స్కూల్, హసన్ పర్తి మండలం భీమారంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పర్యటించారు. పరీక్షా కేంద్రాల ఏర్పాట్లు, విద్యార్థుల హాజరు శాతం, ఆయా పరీక్ష కేంద్రాల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# ఉత్తమ అవార్డులు దక్కించుకున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు




రాయపర్తి,మార్చి21(జర్నలిస్ట్ వార్త): సమాజ సేవయే లక్ష్యంగా లయన్స్ క్లబ్ ఆఫ్ వర్ధన్నపేట వారు ఉత్తమ అవార్డులు సొంతం చేసుకున్నారు. గురువారం మండల కేంద్రానికి చెందిన లయన్స్ క్లబ్ ఆఫ్ వర్ధన్నపేట అధ్యక్షులు రావుల అనిల్ కుమార్, సెక్రటరీ బుద్ధ సునీల్ కుమార్, ట్రెజరర్ మధు లు ఉత్తమ అవార్డులను జిల్లా గవర్నర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. జెడ్.సి మందాటి సుదర్శన్ రెడ్డికి ఉత్తమ జోన్ చైర్మన్ గా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు రావుల అనిల్ మాట్లాడుతూ మాజీ గవర్నర్ ముచ్చ రాజి రెడ్డి, క్లబ్ సీనియర్ నాయకులు ఆశీస్సులతో అవార్డులు రావడం జరిగిందని అన్నారు.

# పోషకాహారంతోనే తల్లిబిడ్డ ఆరోగ్యం

## -సిడిపిఓ డెబోరా




**రాయపర్తి,మార్చి21(జర్నలిస్ట్ వార్త):** పోషకాహారంతోనే తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని సిడిపిఓ డేబోరా అన్నారు. గురువారం మండలంలోని మైలారం గ్రామం అంగన్ వాడి కేంద్రంలో పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని పిల్లలకు అందించాలని అన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ సత్యవతి, అంగన్వాడీ టీచర్స్ ప్రమీల, రాజశ్వరి, హెల్పర్ లక్ష్మి, ఆశ వర్కర్ లత తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎల్‌సి కవితపై ఐదో రోజు ఇడి ప్రశ్నల వర్షం



**(జర్నలిస్ట్ వార్త)హైదరాబాద్ :** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బిఆర్ఎస్ ఎంఎంల్సి కవితపై 5వ రోజైన గురువారం ఇడి అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. లిక్కర్ పాలసీ మనీలాండరింగ్ కేసులో కవిత పాత్రపై అధికారులు ఆరా తీశారు. 100 కోట్ల ముడుపులు, సౌత్ గ్రూప్ పాత్రపై ప్రశ్నించారు. మనీశ్ సిసోడియా, అరవింద్ కేజ్రీవాల్ తో ఒప్పందాలు సహా కేసులో నిందితులు ఇచ్చిన వాంగూల్మాల ఆధారంగా కవితను ప్రశ్నించారు. రోజుకు దాదాపు 6 నుంచి 7 గంటల పాటు ప్రశ్నిస్తున్న ఇడి లిఖితపూర్వకంగా, మౌఖికంగా కవిత నుంచి వివరాలు రాబడు తున్నట్లు తెలిసింది. బుధవారం కవిత పిఎలు రాజేశ్, రోహిత్ లను ప్రశ్నించిన ఇడి అధికారులు కవిత అరెస్ట్ సమయంలో సీజ్ చేసిన ఫోన్లలో ఉన్న సమాచారంపై ప్రశ్నించినట్లు సమాచారం. ఇడి కస్టడీలో రోజూ కవితకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వెల్లడించారు. కవిత ఇడి కార్యాలయంలోని క్యాంటీన్ భోజనమే తింటున్నట్లు సమాచారం. ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ సెక్షన్-19 కింద కవితను మార్చి 15వ తేదీన అరెస్ట్ చేశారు. రౌస్ అవెన్యూ కోర్టు ఉత్తర్వుల మేరకు కవిత వారం రోజుల ఇడి కస్టడీలో ఉన్నారు. కవిత నుంచి అనేక సమాచారం సేకరించాల్సి ఉంది. లిక్కర్ పాలసీ రూపకల్పన, 100 కోట్ల ముడుపులు, మనీశ్ సిసోడియా, కేజ్రీవాల్ తో ఉన్న ఒప్పందాలు, సౌత్ గ్రూప్ పాత్రకు సంబంధించిన అంశాలపైన కవితను ప్రశ్నించాల్సి ఉంది. గతంలో కవిత అనేక ఆధారాలను నాశనం చేశారని, ఫోన్లలో ఉన్న సమాచారాన్ని డిలీట్ చేశారని, ఈ కేసుతో తనకు ఎటువంటి సంబంధం లేదని తప్పుడు సమాచారం ఇచ్చారని ఇడి అధికారులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. ఇడి వద్ద ఉన్న ఆధారాలకు అనుగుణంగా కోర్టు కవిత కస్టడీకి అనుమతించింది. ప్రస్తుతం 5వ రోజు కవితను ఈడీ అధికారులు విచారించారు.

# అబద్ధమని నిరూపిస్తారా

- -సీఎం రేవంత్ రెడ్డికి క్రిశాంక్ సవాల్
- -చిత్రపురి అక్రమాలు గురించి ప్రశ్నిస్తే
- -తనపై కేసులా అంటూ మండిపాటు
- -సాక్షాత్తు ఆ కమిటి వారే గవర్నర్ కు ఫిర్యాదు
- -గతాన్ని గుర్తు చేసిన క్రిశాంక్
- -అక్రమాల నిరూపణకు ఏ కోర్టుకెళ్లేందుకైనా సిద్ధం




**(జర్నలిస్ట్ వార్త)హైదరాబాద్ :**చిత్రపురి సొసైటీలో రూ.3 వేల కోట్ల భూదందాకు పాల్పడిన అనుముల మహానంద రెడ్డికి తనకు ఏం సంబంధం లేదని రేవంత్ రెడ్డి నిరూపించగలరా..? అని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ సవాల్ విసిరారు. భూదందాకు సంబంధించిన పోస్టు పెట్టినందుకు మన్నె క్రిశాంక్‌పై మాదాపూర్ పోలీసులు నిన్న కేసు నమోదు చేసి, ఆయన ఫోన్‌ను సీజ్ చేశారు.దీనిపై నేడు క్రిశాంక్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ%ొ% చిత్రపురి సొసైటీలో రూ.3 వేల కోట్ల భూదందా చేసిన అనుముల మహానంద రెడ్డికి, సీఎం రేవంత్ రెడ్డికి సంబంధం ఉందని ఆధారాలు ఉన్నాయన్నారు. దమ్ముంటే ఇది తప్పని రేవంత్ రెడ్డి కోర్టుకి వచ్చి నిరూపించగలరా ? అని ప్రశ్నించారు%ొ% ఆయన ఎవరో మాకు తెలియదు.. ఆయనను అసలు చూడనే చూడలేదు అని వాదిస్తున్నారని, ఆయనతో పరిచయమే లేకపోతే, ఆయనను చూడకపోతే ఈ ఫొటోలు ఎలా వస్తాయి..? అంటూ రేవంత్ తో మహానందరెడ్డి కలసి ఉన్న ఫోటోలను విడుదల చేశారు.. కోర్టుకు వచ్చి ఈ ఫొటో తప్పని నిరూపించగలరా..? అంటూ దీనిపై సుప్రీంకోర్టు, హైకోర్టు.. ఏ కోర్టుకైనా సరే వెళ్దామని అన్నారు%తామే కాదని, చిత్రపురి సాధన సమితి వారు కూడా ఈ భూదందాపై గతంలో ప్రశ్నించారని గుర్తు చేశారు.. ఈ భూదందాలపై మాజీ గవర్నర్ తమిళిసైకి కూడా చిత్రపురి సాధన సమితి వారు ట్వీట్ చేశారని పేర్కొన్నారు. ఇందులో రూ.3 వేల కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. చిత్రపురి సిటీపై కేసులు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో ప్రశ్నించిన వాటిపై మళ్లీ తాము ప్రశ్నించినందుకు తన మీద కేసు నమోదు చేసి.. ఫోన్‌ను కూడా సీజ్ చేశారని, ఇదెక్కడి నాయమంటూ రేవంత్ ను నిలదీశారు..

# పదవుల్లో ప్రాతినిధ్యమివ్వండి

## మంత్రి పొన్నంకు దాసు సురేశ్ వినతి

**(జర్నలిస్ట్ వార్త)హైదరాబాద్ :** ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీ, అగ్రవర్ణ పేదలకు ప్రభుత్వం 17 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేయటంలో బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలకంగా వ్యవహరించారని బిసి రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేశ్ అన్నారు. దాసు సురేశ్ నేతృత్వంలో ప్రతినిధి బృందం గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్ ను ఘనంగా సన్మానించారు.. ఇటీవల ప్రకటించిన 37 జనరల్ కార్పోరేషన్‌లలోనూ 13 కార్పొరేషన్లకు చైర్మన్లుగా బిసిలను ప్రకటించడంపై ప్రభుత్వాన్ని అభినందించారు. ఈ సందర్భంగా దాసు సురేశ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో బిసి రిజర్వేషన్లను గత ప్రభుత్వం గణనీయంగా తగ్గించడంతో బిసిల నాయకత్వం అణగదొక్కబడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో బిసిల నాయకత్వ ఎదుగుదలకు కొత్త కార్పొరేషన్లను ఏర్పాటుచేసి పాలక మండళ్లను ఏర్పాటుచేయాలని గతంల అనేక పోరాటాలు చేసి తాము అరెస్టులపాలైనా సాధ్యంకాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక నేడు శీఘ్రగతిన 100 రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అది సాధ్యమయ్యిందని కొనియాడారు. అందుకు ముఖ్యమంత్రికి అభినందనలు తెలిపారు.



బిసి సమస్యలను నివేదించిన వెంటనే బిసిల ఆర్థిక అభివృద్ధి కోసం బడ్జెట్‌లో రూ.8 వేల కోట్లు కేటాయించటం, బిసి, ఎస్సి, ఎస్టి, మైనారిటీ గురుకులాలకు సమీకృత స్వంత భవనాలను ఏర్పాటు చేయటం, 100 రోజుల పాలనలో నిరుద్యోగులకు 30 వేల ఉద్యోగాలను భర్తీ చేయడం, ఉపాధ్యాయ నియామకాలకోసం టెట్ ను నిర్వహించడం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ,రూ. 500 లకే గ్యాస్ సిలెండర్ , 200 యూనిట్ల ఉచిత విద్యుత్ తదితర అంశాలపై ప్రభుత్వం పేద ప్రజల పక్షాన నిలబడి పనులను శీగ్రగతిన పూర్తిచేయడం పట్ల బిసిల తరపున మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

గత ప్రభుత్వ పదేళ్ళ కాలంలో ప్రజా పోరాటాల్లో కాంగ్రెస్ కు మద్దతుగా నిలచిన ప్రజాఉద్యమ సంఘాలు, సివిల్ సొసైటీ నాయకులకు సైతం కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమానంగా ప్రాధాన్యతకలిగిన నామినేటెడ్ పదవులలో అవకాశాలు ఇవ్వాలని మంత్రికి విన్నవించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా సామజిక న్యాయం కోసం పోరాటం చేస్తుండగా తెలంగాణలో మాత్రం పదవులన్నీ ఒకే సామాజిక వర్గానికే పరిమితం అవుతున్నాయని దాసు సురేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంతి రేవంత్ రెడ్డి ఈ విషయాలను పరిగణలోకి తీసుకోవాలని బిసిల నాయకత్వపు ఎదుగుదలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి రాజ్యాధికార సమితి గౌరవ అధ్యక్షులు దొంత ఆనందం, పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్ తులసీ శ్రీమన్ ,మహిళా కన్వీనర్ బోనం ఊర్మిళ , రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండ స్వామి, రాష్ట్ర కార్యదర్శి వీరాస్వామి యాదవ్ , మీడియా సెక్రటరీ మారేపల్లి లక్ష్మణ్ , బిసి రాజ్యాధికార సమితి వ్యవస్థాపక సభ్యురాలు దోనేటి కృష్ణలత, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు పద్మావతి, ప్రధాన కార్యదర్శి గోషిక స్వప్న, సెక్రటరీ లక్ష్మి, ఆంధ్రప్రదేశ్ కన్వీనర్ కాలసముద్రం సుధాకర్ , రాష్ట్ర కార్యదర్శి పెండెం నాగభూషణం,వెంకట్ యాదవ్ ,సుధాకర్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొదిల రాజు ,యూత్ కమిటీ జనరల్ సెక్రటరీ మడత కిషోర్ , దామెరకొండ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు

# హుజూర్ నగర్ విద్యార్థులకు, నిరుద్యోగులకు శుభవార్త

## హుజూర్ నగర్ కు ప్రభుత్వ ఐ.టి.ఐ కి రూ. 41.28 కోట్లు మంజూరు.

## నీటి పారుదల & పౌరసఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

హుజూర్ నగర్: **మార్చి 21 (జర్నలిస్ట్ వార్త)** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ వంద రోజుల్లోనే హుజుర్ నగర్ విద్యార్థులకు,నిరుద్యోగులకు శుభవార్త వచ్చింది.హుజూర్ నగర్ లో ఏటా 110 మంది విద్యార్థులకు లాభం చేకూరేలా ప్రభుత్వం ఐటిఐ ఏర్పాటు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఐటిఐ లో పాత కోర్సులతో పాటు అదనంగా 5 రకాల కొత్త ట్రేడ్ లను ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.ఫిట్టర్ లో రెండు యూనిట్లలో 40 మంది విద్యార్థులకు విద్యానభ్యసించే అవకాశం ఉంది.రెండేళ్ల వ్యవధి ఉండే ఈ కోర్సు ను ప్రభుత్వం ఇక్కడ ఏర్పాటు చేసింది. అలాగే ఎలక్ట్రీషియన్ ట్రేడ్ లో 2 యూనిట్లలో 40 మంది విద్యార్థులకు రెండేళ్ల విద్య, డ్రాఫ్ట్ మ్యాన్ సివిల్ ట్రేడ్ లో 2 యూనిట్లలో 40 మంది విద్యార్థులకు, డీజిల్ మెకానిక్ ట్రేడ్ లో 2 యూనిట్లలో 40 మంది విద్యార్థులకు, వెల్డర్ ట్రేడ్ లో 2 యూనిట్లలో 30 మంది విద్యార్థులకు ఒక ఏడాది కోర్సు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఐటిఐ లో ప్రభుత్వం సివిల్ పనులు,యంత్రాంగం, పరికరాలు,ట్రైనర్లు, మానవ



వనరుల ఏర్పాటు కోసం అత్యవసర వ్యయం కింద 41.28 కోట్ల రూపాయలను మంజూరు చేసింది. మొత్తం ప్రాజెక్ట్ వ్యయంతో ఎలక్ట్రిక్ వాహనాల నిర్వహణ, రోబోటిక్స్, ఆటోమెషీన్ సీఎడి సీఎం, సీఎన్ సి మెషీనింగ్, అడ్వాన్స్ ప్లంబింగ్ ఆడిటివ్ మానుఫ్యాక్చరింగ్ వంటి 23 స్వల్పకాలిక కోర్సులతో పాటు న్యూ ఢిల్లీలోని జాతీయ వృత్తి శిక్షణ మండలి (ఎన్.సి.టి.వి) ఆమోదించిన ఆరు దీర్ఘకాలిక ట్రేడ్స్ లో 40 అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులను ప్రవేశ పెట్టనుంది. హుజూర్ నగర్ లో కొత్త కోర్సులతో పాటు పాత కోర్సులు మానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమెషీన్,ఇండస్ట్రియల్ రోబోటిక్స్ ఏడాది కోర్సు మరియు డిజిటల్ మానుఫ్యాక్చరింగ్ ఒక యేడాది కోర్సు, ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్సుడ్ టూల్స్ ఒక యేడాది, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్ (మెకానికల్) 2 ఏళ్ల కోర్సు, అడ్వాన్స్ డ్ సి ఎన్ సి మెషీనింగ్ టెక్నీషియన్ రెండేళ్ల కోర్స్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్ రెండేళ్ల కోర్సు లు ఉంటాయి.

ఈ కోర్సుల కోసం 17 రెగ్యులర్ ఉద్యోగులను,5 ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించేందుకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. దీంతో హుజూర్ నగర్ లో ఐటిఐ ఏర్పాటు వల్ల 110 మంది విద్యార్థులకు సాంకేతిక విద్య అందుతుండడంతో విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని స్థానిక ఎమ్మెల్యే, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ఈ అవకాశాలను ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

## కొత్త ఎన్నికల కమిషనర్ల నియామకంపై కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట



**(జర్నలిస్ట్ వార్త) :**
కేంద్రం ఇటీవల నూతన ఎన్నికల కమిషనర్లుగా కేరళకు చెందిన జ్ఞానేశ్ కుమార్, పంజాబ్ కు చెందిన సుఖ్ బీర్ సింగ్ లను నియమించింది. అయితే, ఈ నియామకాలను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు నేడు విచారణ చేపట్టింది. కొత్త ఎన్నికల కమిషనర్ల నియామకంపై స్టే ఇవ్వడానికి నిరాకరించింది. ఈ దశలో ఎన్నికల కమిషనర్ల నియామకంపై స్టే విధించలేమని స్పష్టం చేసింది. ఎన్నికల కమిషనర్ల నియామక చట్టంలో తాము జోక్యం చేసుకోలేమని అత్యున్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది.
సీఈసీ, ఈసీల ఎంపిక ప్యానెల్ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తప్పిస్తూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ యాక్ట్ కు 2023లో కేంద్రం సవరణ చేసింది. ఈ చట్ట సవరణను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు పైవిధంగా పేర్కొంది.

## టెక్ట్స్ మెసేజ్ రూపంలోకి వాయిస్ నోట్ లు...

### కొత్త ఫీచర్ తీసుకువస్తున్న వాట్సాప్

**వాయిస్ మెసేజ్ లను టెక్ట్స్ మెసేజ్ లు గా మార్చే టెక్నాలజీ**
**స్పీచ్ రికగ్నిషన్ సాంకేతికతో పనిచేసే కొత్త ఫీచర్**
**ప్రస్తుతం ప్రయోగాత్మక దశలో ఉన్న ఫీచర్**




**(జర్నలిస్ట్ వార్త):**
ప్రముఖ సోషల్ మెసేజింగ్ యాప్ వాట్సాప్ సరికొత్త ఫీచర్ ను తీసుకువస్తోంది. ఈ నయా ఫీచర్ ద్వారా వాయిస్ నోట్ లను టెక్ట్స్ రూపంలోకి మార్చడం సాధ్యపడుతుంది. స్పీచ్ రికగ్నిషన్ టెక్నాలజీని ఉపయోగించి వాయిస్ మెసేజ్ లను టెక్ట్స్ రూపంలోకి మార్చుతారు. వాయిస్ మెసేజ్ లను వినే పరిస్థితి లేనప్పుడు, ఆ మెసేజ్ లను సందేశాల రూపంలో చదువుకునేందుకు ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. ప్రస్తుతానికి ఐఫోన్ యూజర్లకు ఈ ఫీచర్ బీటా వెర్షన్ రూపంలో అందుబాటులో ఉంది. త్వరలోనే ఆండ్రాయిడ్ యూజర్లకు కూడా ప్రయోగాత్మకంగా అందించనున్నారు. వినికిడి లోపం ఉన్న వారికి ఈ ఫీచర్ ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందని వాట్సాప్ భావిస్తోంది.

## విశాఖపట్నంలో డ్రగ్స్ కలకలం.. 25 వేల కేజీల కొకైన్ సీజ్..

**మార్చి21(జర్నలిస్ట్ వార్త)** విశాఖపట్నం:
విశాఖపట్నం పోర్టు సమీపంలోని ఓడలో గురువారం భారీ మొత్తంలో మాదక ద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నట్లు సీబీఐ అధికారులు తెలిపారు. ఈ కంటైనర్‌లో మొత్తం 25,000 కిలోల కొకైన్ ను ఈస్ట్ బ్యాగులలో కలిపినట్లు కేంద్ర దర్యాప్తు సంస్థ గుర్తించింది. మొత్తం సరుకులో మాదక ద్రవ్యాలు ఉన్నాయనే విషయంపై ఆరా తీస్తున్నట్లు పేర్కొన్నారు.
ఇంటర్‌పోల్ ఇన్‌పుట్ తర్వాత, సీబీఐ ఆపరేషన్‌లో కస్టమ్స్ సహాయంతో నిషిద్ధ వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు స్పష్టం చేశారు. జర్మనీలోని హ్యాంబర్గ్ మీదుగా ఈ నెల 16న విశాఖపట్నం వచ్చినట్లు అధికారులు గుర్తించారు. బ్రెజిల్ నుంచి విశాఖపట్నంలోని సంధ్యా ఎక్స్‌పోర్ట్స్‌కు కంటైనర్ వచ్చినట్లు తెలిపారు. మొత్తం వెయ్యి బ్యాగుల్లో డ్రగ్స్ తరలించినట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే, కంటైనర్ విశాఖలోని ఓ ప్రైవేటు కంపెనీ పేరుతో డెలివరీ అడ్రస్ తో డెలివరీ చేసేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఇక ఆ అడ్రస్ ఆధారంగానే కేసు నమోదు చేసిన సీబీఐ దర్యాప్తును ముమ్మరం చేసింది.

## కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి



**మార్చి21(జర్నలిస్ట్ వార్త)**నిర్మల్ :
నిర్మల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయాక పలువురు నేతలు ఆ పార్టీని వీడుతున్నారు. తాజాగా విఠల్ రెడ్డి కూడా బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరుల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి సీతక్క ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.విఠల్ రెడ్డి 2014లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. 2018లోను బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి గెలిచారు. 2023 ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ నుంచి పోటీ చేసినప్పటికీ బీజేపీ అభ్యర్థి రామారావు పవార్ చేతిలో ఓడిపోయారు. రామారావు పవార్ 24వేల మెజార్టీతో విజయం సాధించారు.

# నేటి నుంచి ఐపీఎల్ 17

**అతిపెద్ద వేసవి వినోదం, అభిమానులు ఏడాది పాటు ఎదురుచూసే పరుగుల పండుగ వచ్చేసింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ సీజన్ క్రికెట్ ప్రపంచాన్ని ఉర్రూతలూగించేందుకు సిద్ధమైంది.**

**(జర్నలిస్ట్ వార్త):**
పది జట్లు పోటీపడే పాపులర్ గ్లోబల్ టీ20 లీగ్ ఐపీఎల్ నేటి నుంచి ఆరంభం కానుంది. చెన్నై చెపాక్ స్టేడియంలో సూపర్కింగ్స్, రాయల్ చాలెంజర్స్ ఆరంభ మ్యాచ్లో ఢీకొట్టెనున్నారు.




10 జట్లు, 74 మ్యాచులు, ఓ టైటిల్. పొట్టి ఫార్మాట్లో టీ20 ప్రపంచకప్ మేనియాను మించిపోతున్న ఐపీఎల్ టైటిల్ను అందుకునేందుకు ఈ సీజన్లో సైతం పది జట్లు పోటీపడుతున్నాయి. మరోసారి ఐపీఎల్ విజేతగా నిలిచేందుకు ఆరు జట్లు సిద్ధమవుతుండగా%ా% కనీసం ఒక్కసారైనా ఆ టైటిల్ను ముద్దాడాలని నాలుగు జట్లు తపన పడుతున్నాయి.ధనాధన్కు వేళాయే. పరుగుల పండుగ వచ్చేసింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ సీజన్ నేటి నుంచి ఆరంభం. చెన్నైలోని ఎం.ఏ చిదంబరం స్టేడియంలో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్కింగ్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ సీజన్ తొలి మ్యాచ్లో తలపడనున్నాయి. ఆరంభ మ్యాచ్ రాత్రి 8 గంటలకు ఆరంభం కానుండగా.. మిగతా మ్యాచులు 7.30 గంటలకే షురూ అవుతాయి. ఐపీఎల్ సీజన్కు ఆరంభ వేడుకలు ఆది నుంచి ప్రత్యేకం. ఈ సీజన్కు సైతం బీసీసీఐ ఆరంభ వేడుకలను ఘనంగా ప్రణాళిక చేసింది. దిగ్గజ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ బాణీలు, బాలీవుడ్ నటులు అక్షరు కుమార్, టైగర్ ష్రాఫ్ నృత్య ప్రదర్శన ఆరంభ వేడుకలకు ప్రధాన ఆకర్షణగా నిలువనుంది. ప్రముఖ బాలీవుడు గాయకులు, దక్షిణాది గాయకులు నేడు చెపాక్లో ఆటపాటలతో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు.

## వార్నర్ ఫ్యాన్స్ స్పెషల్ గిఫ్ట్..

### జై రామ్ అంటూ నినాదాలు చేసిన వార్నర్..!



**(జర్నలిస్ట్ వార్త):**
ఐపీఎల్ ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్ తమ సెకండ్ హెూంగ్రౌండ్లో మ్యాచ్ లో ఆడేందుకు వైజాగ్ చేరుకుంది. ఈ నేపథ్యంలోనే ఆస్ట్రేలియా స్టార్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ వైజాగ్ ఎయిర్ పోర్టులో ఘన స్వాగతం లభించింది.వార్నర్ వైజాగ్ వచ్చిన సందర్భంగా స్థానికంగా ఉన్న కొందరు ఫ్యాన్స్ ఆయనకు సత్కారం జరిపి, ప్రత్యేక బహుమతి అందజేశారు.
వైజాగ్ లోని తెలుగు ఫ్యాన్స్ వార్నర్కు జై శ్రీరామ్ కండువా కప్పి సత్కరించడంతో పాటు అయోధ్య ప్రతిమను బహుమతిగా అందజేశారు. దీంతో ఫ్యాన్స్ అందించిన బహుమతికి ఫిదా అయిన వార్నర్.. వారితో కలిసి జై శ్రీరాం అంటూ నినాదాలు కూడా చేశారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. కాగా ఐపీఎల్ లో ఢిల్లీ క్యాపిటల్స్ టీం తమ సెకండ్ హెూంగ్రౌండ్ గా విశాఖను ప్రకటించింది. ఇందులో భాగంగానే మొదటి భాగం మ్యాచ్ లను ఆడేందుకు వైజాగ్ చేరుకున్న ఢిల్లీ జట్టు.. మధురవాడ స్టేడియంలో ప్రాక్టీస్ కూడా ప్రారంభించారు.

## కెప్టెన్సీ వదిలేసిన ఎం.ఎస్ ధోని

### - సూపర్కింగ్స్ కొత్త కెప్టెన్ రుతురాజ్




**మార్చి21(జర్నలిస్ట్ వార్త):** చెన్నై :
‘ ఈ సీజన్లో కొత్త పాత్ర కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను’ ఐపీఎల్ ఆరంభానికి ఓ పది రోజుల ముంగిట మహేంద్ర సింగ్ ధోని సోషల్ మీడియా పోస్ట్ ఇది.అభిమానుల కోసం మరో సీజన్ ఆడేందుకు మోకాలి గాయానికి శస్త్రచికత్స సైతం చేయించుకున్న మహి.. ఐపీఎల్ 17లో కచ్చితంగా ఆడుతాడని తెలుసు. అయినా, సూపర్కింగ్స్ శిబిరంలో ఇంకా సరికొత్త బాధ్యత ఏమైఉంటందని అభిమానుల్లో విపరీత చర్చ నడిచింది. ఈ సస్పెన్స్కు సూపర్కింగ్స్ యాజమాన్యం గురువారం తెరదించింది. ఎం.ఎస్ ధోని నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకున్నట్టు తెలిపింది. యువ ఆటగాడు రుతురాజ్ గైక్వాడ్ చెన్నై సూపర్కింగ్స్ కొత్త కెప్టెన్ అని ప్రకటించింది. 42 ఏండ్ల ధోని.. ఐపీఎల్ 16లోనూ నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. రవీంద్ర జడేజాకు నాయకత్వ బాధ్యతలు అప్పగించగా.. అతడు ఆశించిన ఫలితాలు రాబట్టలేదు. దీంతో సీజన్ మధ్యలోనే కెప్టెన్సీ వదిలేసి ప్రాంఛైజీ నుంచి వెళ్లిపోయాడు. ఐపీఎల్17 ముంగిట మళ్లీ ధోని కెప్టెన్సీ వదులుకోగా.. రుతురాజ్ గైక్వాడ్కు నాయకత్వ పగ్గాలు దక్కాయి. ఎం.ఎస్ ధోని సూపర్కింగ్స్ను 212 ఐపీఎల్ మ్యాచ్లో కెప్టెన్గా నడిపించగా.. 128 విజయాలు సాధించి, 82 పరాజయాలు చవిచూశాడు.

## క్వార్టర్స్‌కు త్రీస్సాగాయత్రి



**(జర్నలిస్ట్ వార్త):**
స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ బసెల్(స్విట్జర్లాండ్): స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి యువ షట్లర్లు త్రీసా జోలీ-గాయత్రీ గోపీచంద్ ప్రవేశించారు.గురువారం జరిగిన రెండోరౌండ్ పోటీలో త్రీస్సాగాయత్రి జంట 21-10, 21-12తో సహచర ఆటగాళ్లు ప్రియ్షామిశ్రాలను చిత్తుచేశారు. ఈ మ్యాచ్ కేవలం 36నిమిషాల్లోనే ముగించింది. అంతకుముందు తొలిరౌండ్‌లో 8వ సీడ్ త్రీస్సాగాయత్రి 21-15, 21-12తో అన్‌సీడెడ్, అమెరికాకు చెందిన అన్నోకెర్రీలను చిత్తుచేశారు.



# నింగిలోన చందమామ కిందకు దిగొచ్చిందా..?


సవ్యసాచితో తెలుగు తెరకు పరిచయమైన నిధి అగర్వాల్ అంతకుముందే తన సోషల్ మీడియా క్రేజ్ తో సౌత్ లో సూపర్ పాపులారిటీ తెచ్చుకుంది. క్రికెటర్ తో డేటింగ్ వార్తలతో అమ్మడి గురించి మరింత మందికి తెలిసింది. అక్కినేని హీరోతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన నిధి ఇస్మార్ట్ శంకర్ హిట్ తో సూపర్ క్రేజ్ తెచ్చుకుంది. ఆ సినిమాలో నిధి అందాలను పూరీ పర్ఫెక్ట్ గా వాడుకున్నాడు. ఇస్మార్ట్ శంకర్ తర్వాత కెరీర్ దూకుడు చూపిస్తుంది అనుకుంటే అమ్మడు సెలెక్టెడ్ సినిమాలు చేస్తూ వస్తుంది. తెలుగు కన్నా తమిళ పరిశ్రమ మీద ఎక్కువ దృష్టి పెట్టిన నిధి అగర్వాల్ అక్కడ క్రేజీ ఫ్యాన్స్ ని ఏర్పరచుకుంది. నిధి కోసం అక్కడ అభిమాన సంఘాలు ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారంటే కోలీవుడ్ లో అమ్మడి క్రేజ్ ఏంటన్నది అర్థం చేసుకోవచ్చు. గల్లా అశోక్ లీడ్ రోల్ లో చేసిన హీరో సినిమాలో నటించిన నిధి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ క్రిష్ కాంబోలో వస్తున్న హరి హర వీరమల్లు సినిమాలో కూడా నటిస్తుంది. తెలుగులో అవకాశాలు రావట్లేదా లేదా తనే వద్దనుకుందా అన్నది తెలియదు కానీ నిధి ఇన్ స్టా ప్రమోషన్స్ తోనే రెండు చేతులా సంపాదిస్తుందని తెలుస్తుంది. అందుకే సినిమాల కన్నా ఇదే మంచి సోర్స్ అని సోషల్ మీడియా ప్రమోషన్స్ చేస్తూ వస్తుంది. ఇక ప్రొడక్ట్ ప్రమోషన్స్ తో పాటుగా నిధి చేసే గ్లామర్ ఫోటో షూట్ ఫాలోవర్స్ కి మాంచి కిక్ ఇస్తుంది.ప్రతి హీరోయిన్ ఇన్ స్టాగ్రాం లో ఫోటో షూట్స్ చేస్తుంటారు. కానీ కొందరికి మాత్రమే రెగ్యులర్ ఫాలోవర్స్ ఉంటారు. అలాంటి భామల్లో నిధి అగర్వాల్ ఒకరు. లేటెస్ట్ గా అమ్మడు మూన్ లైట్ కలర్ శారీలో అందాలను వెదచల్లుతుంది. కట్టింది శారీనే అయినా ఆమె చేస్తున్న గ్లామర్ ట్రీట్ నెక్స్ట్ లెవెల్ అని చెప్పొచ్చు. ఇక నిధి చేసిన ఈ ఫోటో షూట్స్ కి నింగిలోన చందమామ భూమీదకు వచ్చిందేంటి అంటూ క్రేజీ కామెంట్స్ పెడుతున్నారు. తెలుగు తమిళ భాషల్లో క్రేజీ ఫాలోవర్స్ ఉన్న నిధి ఇలా ఫోటో షూట్స్ తోనే కాదు సినిమాలతో కూడా అలరిస్తే ఇంకాస్త బాగుంటుందని అనుకుంటున్న వారు ఉన్నారు. నిధి కొద్దిగా కాన్సెంట్రేట్ చేస్తే చాలు కానీ అమ్మడు టాప్ ప్లేస్ కి వెళ్లే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు.

# తొలి దక్షిణాది నటుడిగా అల్లు అర్జున్ సెన్సేషనల్ రికార్డు!




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సౌత్ ఇండియాలో సెన్సేషనల్ రికార్డు సాధించాడు. తాజాగా బన్నీ ఇన్‌స్టాగ్రామ్‌లో 25 మిలియన్ల ఫాలోవర్లను సొంతం చేసుకున్నాడు. దీంతో 25 మిలియన్ల ఫాలోవర్లు ఉన్న తొలి దక్షిణాది నటుడిగా రికార్డులకెక్కాడు. ఐకాన్ స్టార్ తర్వాత విజయ్ దేవరకొండ (21.3 మిలియన్లు), రామ్ చరణ్ (20.8 మిలియన్లు), దుల్కర్ సల్మాన్ (14.1 మిలియన్లు), యశ్ (13.5 మిలియన్లు), మహేశ్ బాబు (13.4 మిలియన్లు), ప్రభాస్ (11.7 మిలియన్లు), దళపతి విజయ్ (10.8 మిలియన్లు) లకు ఫాలోవర్లు ఉన్నారు. ఇక అల్లు అర్జున్ సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం సుకుమార్ దర్శకత్వంలో 'పుష్ప-2' మూవీలో నటిస్తున్నాడు. 'పుష్ప: ది రైజ్' కు సీక్వెల్‌గా ఈ చిత్రం వస్తోంది. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ మూవీ ఆగస్టు 15వ తేదీన థియేటర్లలోకి రానుంది. 'పుష్ప-2' తర్వాత ఐకాన్ స్టార్ మాటల మాంత్రికుడు త్రివిక్రమ్, సందీప్ రెడ్డి వంగాలతో సినిమాలు చేయనున్నాడని సమాచారం. కాగా, పుష్ప సినిమాలోని నటనకు గాను బన్నీ జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు అందుకున్న విషయం తెలిసిందే.

# మోకాళ్లపై మెట్లెక్కి.. తిరుమల స్వామి వారిని దర్శించుకున్న జాన్వీకపూర్



అతిలోక సుందరి శ్రీదేవి పెద్ద కూతురు జాన్వీ కపూర్ తరచూ దర్శనం కోసం తిరుమలకు వస్తుంటారనే విషయం తెలిసిందే. ఈ నెల 6న కూడా జాన్వీ తన బర్త్‌డే సందర్భంగా స్నేహితులతో కలిసి స్వామి వారిని దర్శించుకుంది. తన స్నేహితులు శిఖర్ పహారియా, ఒరీతో కలిసి వెంకటేశ్వర స్వామి వారి సేవలో పాల్గొన్నారు. ఇలా స్వామి వారి సేవలో పాల్గొన్న సమయంలో తీసిన ఓ వీడియోను ఒరీ తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసింది. తిరుమల యాత్ర ఎలా జరిగిందో అందులో వివరించిందామె. చెన్నైలోని జాన్వీ కపూర్ ఇంటి నుంచి కారులో మూడు గంటల ప్రయాణం తర్వాత తిరుమల చేరుకున్నట్లు ఆమె పేర్కొంది. ఆ తర్వాత జాన్వీ బంధువులతో కలిసి నడక దారిన తిరుమల చేరుకున్నామని తెలిపింది. ఈ క్రమంలో మోకాళ్ల మిట్ట వద్ద జాన్వీ-శిఖర్ మోకాళ్లపై మెట్లెక్కారు. దాదాపు 50సార్లు తానుకు ఇక్కడికి వచ్చినట్లు ఒరీ తెలియజేసింది. ఈ దేవాలయం అంటే తనకెంతో ఇష్టమని కూడా ఆమె చెప్పుకొచ్చింది. ఇక ప్రస్తుతం జాన్వీ రెండు బడా తెలుగు సినిమాల్లో నటిస్తున్న విషయం తెలిసిందే. అందులో ఒకటి యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన దేవర చిత్రం కాగా, మరొకటి గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ తేజ్‌తో. ఈ మూవీని ఉప్పెన ఫేం బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తున్నాడు. బుధవారం ఈ చిత్రం పూజా కార్యక్రమం జరుపుకుంది. ఈ కార్యక్రమం అనంతరం జాన్వీ తన తండ్రి బోనీ కపూర్‌తో కలిసి చెర్రీ నివాసానికి వెళ్లింది. అక్కడ దర్శకుడు బుచ్చిబాబుతో పాటు ఇతర చిత్రయూనిట్‌తో కలిసి కొద్దిసేపు సరదాగా గడిపారు. దీనికి సంబంధించిన ఫొటోలను జాన్వీకపూర్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా అభిమానులతో పంచుకుంది.



# లెదర్ ఫ్రాక్ లో పరిమళించిన బ్యూటీ!

ప్రగ్యా జైశ్వాల్ టాలీవుడ్ జర్నీ గురించి తెలిసిందే. మిర్చి లాంటి కుర్రాడు నుంచి సన్నాఫ్ ఇండియా వరకూ పడతా లేస్తా సినిమాలు చేసింది. అంతకు ముందే కోలీవుడ్ లో ఎంట్రీ.. ఆ తర్వాత బాలీవుడ్ లోనూ లాంచ్ అయింది. ఈ రెండు భాషలకంటే బెటర్ గా తెలుగు లోనే సినిమాలు చేసింది. ఇక్కడ కూడా కెరీర్ చరమాంకానికి చేరుకోవడం తో పాటు తమిళ్..హిందీ భాషల్లో కూడా అవకాశాలు రాకపోవడంతో ఇక పరిశ్రమ నుంచి ఎగ్జిట్ అవ్వాల్సిందే అన్న విమర్శలు ఎదుర్కొంది. గత ఏడాది పూర్తిగా ఖళీగానే కనిపించింది. కానీ అమ్మడు మాత్రం ప్రయత్నాలు ఏనాడు ఆపలేదు. అభిమానులకు నిరంతరం ఇన్ స్టా ద్వారా టచ్ లో నే ఉంటుంది. హాట్ ఫోటోలతో అలరించే ప్రయత్నంలో కొంత వరకూ సక్సెస్ అయింది. అవకాశాలు లేవు అనే మాట తప్పు! అభిమానుల్లోనే ఉన్నాను అనే పాజిటివ్ సైన్ తో ముందుకెళ్తుంది. తాజాగా సొగసరి మరో హాట్ ఫోటోతో నెటి జనుల ముందుకొచ్చేసింది. ఇదిగో ఇక్కడిలా గోల్డ్ కలర్ ఔట్ ఫిట్ లో అమ్మడు తళతళ లాడిపోతుంది. లెదర్ ఫ్రాక్ లో ప్రగ్యా గుభాళింపు మామూలుగా లేదు. సొగసైన భంగిమలో అమ్మడు హొయలు పోయిన తీరు కుర్రాళ్లలో సెగలు పుట్టిస్తుంది. ప్రగ్యా ముస్తాబైన విధానం..స్కిన్ టోన్ ప్రతీది అమ్మడిని మరింత అందంగా తీర్చిదిద్దాయి. మత్తెక్కించే చూపులతో హృదయాల్ని ఛిద్రం చేసేస్తోంది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. ప్రగ్యా అందానికి అభిమానులంతా ఫిదా అవుతున్నారు. బ్యూటీని ఉద్దేశించి హాట్ కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు. ఇక సినిమాల సంగతి చూస్తే అమ్మడు హిందీలో ఖేల్ ఖేల్ మోయిన్ అనే చిత్రంలో నటిస్తోంది. చేతిలో ఉన్నది ఈ ఒక్క చిత్రమే. కొత్త అవకాశాల కోసం అక్కడే సీరియస్ గా ట్రై చేస్తుందని సమాచారం. బాలీవుడ్ లో అమ్మడు ఇప్పటివరకూ ఒకే ఒక్క చిత్రం చేసింది. అదీ కెరీర్ ఆరంభంలో. ఆ తర్వాత ఇతర భాషల్లోనే బిజీ అయింది. మళ్లీ ఇప్పుడు బాలీవుడ్ కే వెళ్లింది.

# ప్రేమలు భామ వెంట పడుతున్న నిర్మాతలు..!



మలయాళంలో సూపర్ హిట్టైన ప్రేమలు సినిమా తెలుగులో కూడా యూత్ ఆడియన్స్ ను అలరిస్తుంది. సినిమాను రాజమౌళి తనయుడు కార్తికేయ తెలుగు లో రిలీజ్ చేసేసరికి ఎక్కువ రీచింగ్ వచ్చింది. తెలుగు యువత అంతా కూడా ప్రేమలు హీరోయిన్ మమితా బైజుతో ప్రేమలో పడిపోతున్నారు. ప్రేమలు మలయాళంలో బ్లాక్ బస్టర్ కాగా తెలుగులో కూడా ఆ సినిమా బాగానే సందడి చేసింది. ఈ సినిమాలో నటించిన మమితా బైజుకి అయితే ఇక్కడ సూపర్ పాపులారిటీ వచ్చింది. సినిమాలో ఆమె పర్ఫార్మెన్స్ కు తెలుగు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. తెలుగు ఆడియన్స్ కు ఏ హీరోయిన్ అయినా నచ్చేస్తే ఆమెను ఒక రేంజ్ కు లేపుతారు. ప్రేమలు రిలీజ్ అయినప్పటి నుంచి మమితా బైజు ట్రెండింగ్ లో ఉంటుంది. ప్రేమలు చూసిన తర్వాత అమ్మడికి తెలుగులో క్రేజీ ఆఫర్లు వస్తున్నాయి. ఇప్పటికే తమిళంలో విష్ణు విశాల్ తో ఒక సినిమా లాక్ చేసుకున్న మమితా తెలుగులో టైర్ 2 హీరో సినిమా కోసం సంప్రదించారని తెలుస్తుంది. అంతేకాదు తెలుగు మేకర్స్ అంతా కూడా మమితా బైజు వెంట పడుతున్నారని తెలుస్తుంది. 2017 లో మలయాళ సినిమా సర్వోపారి పలక్కరన్ సినిమాతో తెరంగేట్రం చేసిన మమితా బైజు వరుస సినిమాల్లో తన టాలెంట్ చూపిస్తూ ఆకట్టుకుంటుంది. ప్రేమలు సినిమాతో తెలుగు ఆడియన్స్ ముందుకు వచ్చిన మమితా టాలెంట్ మన ప్రేక్షకులకు బాగా నచ్చేసింది. ముఖ్యంగా తెలుగు ఆడియన్స్ లేటెస్ట్ క్రష్ మమితా బైజు అని చెప్పుకుంటున్నారు. సో టాలీవుడ్ లో మమితాకు ఏర్పడిన ఈ క్రేజ్ ఆమెకు వరుస అవకాశాలు తెప్పిస్తాయని చెప్పొచ్చు. మమితా బైజు కూడా తెలుగులో మంచి ఆఫర్లు వస్తే చేయాలని ఆసక్తిగా ఉంది. సో ప్రస్తుతం ఫాం లో ఉన్న హీరోయిన్స్ కి మమితా బైజు కూడా రూపంలో ఒక షాక్ తగలక తప్పేలా లేదు. మరి మమితా ఫస్ట్ తెలుగు ప్రాజెక్ట్ ఏది అవుతుంది అన్నది చూడాలి. కాస్త టాలెంట్ చూపిస్తే చాలు హృదయాల్లో హీరోయిన్స్ కు స్థానం కల్పిస్తారు తెలుగు ఆడియన్స్. ప్రేమలు సినిమాలో మమితా బైజుకి కూడా అదే రేంజ్ రెస్పాన్స్ ఇచ్చారు. కచ్చితంగా అమ్మడు తెలుగులో మరిన్ని సినిమాలతో ఇంకా ఎక్కువ ఇంపాక్ట్ కలుగచేస్తుందని చెప్పొచ్చు

# జపాన్‌లో రాజమౌళి..

## భూకంపంపై కార్తికేయ ట్వీట్ వైరల్



%ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి తన కుమారుడు కార్తికేయతో కలిసి జపాన్‌లో ఉన్నారు. వీరితో పాటు నిర్మాత శోభు యార్లగడ్డ కూడా ఉన్నాడు. 2022లో యంగ్ టైగర్ ఎన్టీఆర్, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోలుగా వచ్చిన బ్లాక్‌బస్టర్ 'ఆర్ఆర్ఆర్' స్పెషల్ షోల కోసం వారు జపాన్ వెళ్లారు. అయితే, జపాన్‌లో తాము బస చేసిన హొటల్ వద్ద భూకంపం వచ్చినట్లు ఎస్ఎస్ కార్తికేయ తాజాగా ట్వీట్ చేశాడు. "జపాన్‌లో ఇప్పుడే భయంకరమైన భూకంపం వచ్చింది. మేము 28వ అంతస్తులో ఉన్నాం. భూమి కంపించడం ప్రారంభించింది. భూకంపం అని గ్రహించి భయాందోళనకు గురయ్యా. కానీ, చుట్టుపక్కల ఉన్న జపనీయులు పెద్దగా పట్టించుకోవడం లేదు. నేను భూకంప అనుభూతి పొందా" అని పేర్కొన్నాడు. అలాగే ఈ ట్వీట్‌కు భూకంపం సమయంలో తన స్మార్ట్ వాచ్‌లో వచ్చిన వార్నింగ్‌ని ఫొటో తీసి కార్తికేయ షేర్ చేశాడు. దీనిపై అభిమానులు తమదైన శైలిలో స్పందిస్తున్నారు. వారు క్షేమంగా తిరిగి రావాలని కోరుకుంటున్నారు. ఇక ఆర్ఆర్ఆర్ చిత్రం పలు అంతర్జాతీయ అవార్డులను సైతం సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఏకంగా ఆస్కార్ అవార్డు కూడా అందుకుంది. 95వ అకాడమీ అవార్డుల్లో మూవీలోని నాటునాటు పాటకు బెస్ట్ ఒరిజినల్ సాంగ్ పురస్కారం దక్కింది. ఇదిలాఉంటే.. రాజమౌళి తన తదుపరి సినిమాను ప్రిన్స్ మహేశ్ బాబుతో చేయనున్నారు. అడ్వెంచర్ డ్రామాగా ఈ మూవీ ఉండబోతుందని రచయిత విజయేంద్ర ప్రసాద్ వెల్లడించారు.